

సాగులో నూతన పద్ధతులు..
నూతన పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కరీంనగర్ వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ నరసింహారెడ్డి అన్నారు.
- 11లో ▸



పత్తిలో పొగాకు లద్దెపురుగు
పత్తి పంటను పొగాకు లద్దెపురుగు ఆశిస్తోంది. రోజురోజుకూ ఉధృతి పెరుగుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.
- 10లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.3 /18.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఏర్పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



కామారెడ్డి క్రైం: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 90 ఫిర్యాదులు వచ్చాయి. అందులో భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించినవి ఎక్కువగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కలెక్టరేట్ పాలనాధికారి మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రిసార్ట్ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి
అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో చేపట్టిన రిసార్ట్ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని భిక్కనూర్‌కు చెందిన పెర్కుల భూపాలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని సిద్ధిరామేశ్వర ఆలయం వెనుక భాగంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో నాలా కన్వర్షన్ తీసుకోకుండానే ఓ వ్యక్తి వ్యవసాయేతర నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. తాను ఇప్పటికి ఐదుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

19, 20 తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

కామారెడ్డి అర్బన్: సీహెచ్ శ్రీనివాస్ స్మారక జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ఈ నెల 19, 20 తేదీల్లో కామారెడ్డిలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధులు సీహెచ్ రాజు, గడీల భాస్కర్ తెలిపారు. విజేత జట్లకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 99892 15251, 94400 37833 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: నిజామాబాద్ ప్రభుత్వ విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు అతిథి అధ్యాపకులను నియమించేందుకు ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధించేందుకు సామాజిక, మానసిక శాస్త్రం ఒక పోస్టు, ఉర్దూ మీడియంలో గణితం, మానసిక, సామాజిక శాస్త్రం బోధించడానికి రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పీజీతోపాటు ఎంఎడ్ అభ్యర్థులు అందుబాటులో లేకపోతే బీఎడ్ చేసిన వారిని పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.23,400 గౌరవ వేతనం చెల్లిస్తామని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అండర్-17 బాల బాలికల వాలీబాల్ విభాగంలో మొదటి విజేతగా తాడ్వాయి జోన్, ద్వితీయ స్థానంలో బాన్సువాడ జోన్, బాలికల విభాగంలో మొదటి స్థానంలో ఎల్లారెడ్డి జోన్, ద్వితీయ స్థానంలో బాన్సువాడ జోన్ నిలిచాయి. అలాగే కబడ్డీ అండర్-14 బాలుర విభాగంలో మొదటి స్థానంలో కామారెడ్డి జోన్, ద్వితీయ స్థానంలోఎల్లారెడ్డి జోన్, బాలికల విభాగంలో కామారెడ్డి జోన్ మొదటి స్థానంలో, తాడ్వాయి జోన్ ద్వితీయ స్థానంలో గెలిచాయి. విజేతలకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి హీరాలాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్‌లు జ్ఞాపికలను అందజేశారు.

వరదొచ్చినపుడల్లా ఆ కాలనీలు నీట మునుగుతున్నాయి. ఈసారి కురిసిన భారీ వర్షాలతో వాగు పొంగి ప్రవహించి ఇళ్లన్నీ నీట మునిగాయి. అయితే, కామారెడ్డి వాగు ఆక్రమణలకు గురవ్వడంతోనే కాలనీలను వరద నీరు చుట్టుముట్టింది. దీంతో చాలా కుటుంబాలు సర్వస్వాన్ని కోల్పోయి రోడ్డున పడ్డాయి. జరిగిన నష్టాన్ని కళ్లారా చూసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చి వెళ్లారు.
– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి


వాగు పొంగడంతో జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఇళ్లను చుట్టేసిన వరద (ఫైల్)

వాగు ప్రవాహానికి దారేది...

- ఇరువైపులా మట్టిని నింపి ఆక్రమణలు
- వరదొస్తే నీట మునుగుతున్న కాలనీలు
- శాశ్వత పరిష్కారం చూపుతామన్న సీఎం
- ముందుకు పడని అడుగులు

జిల్లా కేంద్రంలోని పెద్ద చెరువు అలుగు నీరు ప్రవహించే కామారెడ్డి వాగు దారిపొడవునా ఆక్రమణలకు గురైంది. వాగుకు ఇరువైపులా మట్టిని నింపేసి ఎక్కడికక్కడ ప్లాట్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. దీంతో వాగు వెడల్పు తగ్గి వరద వచ్చినపుడల్లా నీరంతా ఇరువైపులా ఉన్న కాలనీలను చుట్టేస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులపాలవుతున్నారు. మొన్నటి వరద సృష్టించిన బీభత్సం నుంచి ఇంకా ప్రజలు కోలుకోలేకపోతున్నారు. కబ్జాలను తొలగిస్తే కానీ ఇబ్బందులు వీడే పరిస్థితి లేదు. చెరువు అలుగు నుంచి వాగు దాదాపు 14 కిలోమీటర్లు ఉంటుంది. 60 నుంచి 80 మీటర్ల వెడల్పు ఉండాల్సిన వాగు చాలా చోట్ల 20 మీటర్ల నుంచి 30 మీటర్లకు కుచించుకుపోయింది. దానికి తోడు వాగులో వ్యర్థాలను నింపడంతో లోతు కూడా తగ్గిపోయింది. దీంతో భారీ వరద వచ్చినపుడు నీరు వెళ్లడానికి ఇబ్బందులు ఎదురయ్యాయి.


వాగు పొంగి ప్రవహించడంతో రోడ్డు మీదుగా పారుతున్న నీరు (ఫైల్)

నిజాం కాలం నాటి చెరువు...
1897లో అప్పటి ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ ఈ చెరువును నిర్మించాడని చరిత్ర చెబుతోంది. కామారెడ్డి పట్టణ పరిధిలోని వ్యవసాయ భూములకే కాక, ఇరుగు పొరుగు గ్రామాలైన సరంపల్లి, నర్సన్నపల్లి, క్యాసంపల్లి తదితర గ్రామాలకు చెందిన 9 వందల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వడంతోపాటు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు అప్పట్లో పెద్ద చెరువును నిర్మించారు. దీని పొడవు 1.8 కిలోమీటర్ల మేర ఉంది.


ఇరుకుగా మారిన కామారెడ్డి వాగు

చెరువు ఎగువన లింగాపూర్ చెరువు ఉంటుంది. తాడ్వాయి మండలంలోని క్రిష్ణాజివాడి, లింగాపూర్ ప్రాంతాల్లో కురిసిన ప్రతి చుక్క కామారెడ్డి చెరువుకు వచ్చి చేరుతుంది. కాగా, కామారెడ్డి పట్టణం విస్తరించడంతో చెరువు నీటిని పంటలకు వదలకుండా తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా నిర్ణయాలు జరిగాయి. చెరువులో నీరుంటే సగం పట్టణంలో భూగర్భజలాలకు ఇబ్బంది కూడా ఉండదు. బీఆర్ఎస్ పాలనలో చెరువుకు మరమ్మతులు జరిపి మినీ ట్యాంకుబండ్‌గా కొంతమేర అభివృద్ధి చేశారు.

కబ్జాలతో కుచించుకుపోయిన వాగు

పెద్ద చెరువు అలుగు పోసినపుడు నీరంతా వాగు ద్వారా ప్రవహించేది. అయితే వాగు చాలా వరకు కబ్జాకు గురైంది. చెరువు దిగువన వాగుకు ఒకవైపు హౌసింగ్ బోర్డు కాలనీ, మరోవైపు జీఆర్ కాలనీ, సరంపల్లి ఉన్నాయి. రెండు వైపులా కబ్జాలు జరిగాయి. వాగు ప్రవాహం వేగంగా ఉన్నపుడు విస్తీర్ణం సరిపోకపోవడంతో నీరంతా ఇరువైపులా ప్రవహించి ఇళ్లల్లోకి చేరుతోంది. వరద ప్రవాహం సరిగా లేకపోవడంతో పాత జాతీయ రహదారి (ఎన్‌హెచ్-7)పై ఉన్న వంతెనలు దెబ్బతింటున్నాయి. అలాగే ఎన్‌హెచ్-44 పైనా రాకపోకలకు ఆటంకం కలిగింది. దారి పొడవునా వాగును పూడుస్తూనే ఉన్నారు. దీంతో ఏడాదికేడాది వాగు వెడల్పు తగ్గిపోయి వరద నీరంతా కాలనీలను ముంచుతోంది.

చెరువు అలుగు నుంచి మొదలుకొంటే 14 కిలోమీటర్ల పొడవున ఉన్న కామారెడ్డి వాగు విస్తీర్ణంపై సర్వే చేపట్టి ఆక్రమణల లెక్క తేల్చాల్సిన అవసరం ఉంది. అయితే, వరదతో మునిగిన కాలనీల్లో

ఆక్రమణల సంగతి తేలిస్తేనే..

పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు మొదలు కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వాగు ఆక్రమణల నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది. లేదంటే మళ్లీ వరదలొచ్చినపుడు మరింత నష్టం జరిగే అవకాశం ఉంది.

నాలాలు మాయం

ఎగువభాగం నుంచి వచ్చే వర్షపు నీరు పారేందుకు ఉన్న నాలాలు చాలా వరకు అన్యాక్రాంతమయ్యాయి. కాకతీయనగర్, ఎన్జీవోస్ కాలనీ, విద్యానగర్ కాలనీ, దేవునిపల్లి, నిజాంసాగర్ రోడ్డు తదితర ప్రాంతాల మీదుగా కామారెడ్డి పెద్దచెరువులోకి వెళ్లే నాలాలు చాలా వరకు ఉనికే లేకుండా పోయాయి. దీంతో వర్షం కురిసినపుడల్లా ఆయా కాలనీల్లో నీరు రోడ్లమీద నిలిచిపోయి ఇళ్లను ముంచేస్తోంది. అశోక్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి. పట్టణంలో పలు కుంటలు కనుమరుగై కాలనీలుగా మారాయి. దీంతో వర్షపు నీరంతా ఎక్కడిక్కడే నిలిచి ఇళ్లను ముంచెత్తుతోంది. పట్టణంలోని సాయిబాబా ఆలయం ఏటా నీట మునుగుతోంది. స్టేషన్ రోడ్డు, సిరిసిల్లా రోడ్లలో ఉన్న నాలాలు, కాలువలు అడ్రస్ గల్లంతై వర్షపు నీరు రోడ్లను ముంచెత్తుతోంది.

మద్యం దుకాణాలకు 166 దరఖాస్తులు



కామారెడ్డి రూరల్: జిల్లాలోని మద్యం దుకాణాలకు సోమవారం నాటికి 166 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత రావు తెలిపారు. జిల్లాలో మొత్తం 49 దుకాణాలుండగా 5 ఎస్సీ, 2 ఎస్టీ, 7 గౌడ సామాజిక వర్గాలకు కేటాయించారు. ఓపెన్ కేటగిరి కింద 35 దుకాణాలున్నాయి. ఈ నెల 18 వరకు దరఖాస్తులను స్వీకరించి, 23న లక్కీ డ్రా నిర్వహిస్తామని తెలిపారు. సోమవారం వచ్చిన 60 దరఖాస్తులతో కలిపి ఇప్పటి వరకు 166 దరఖాస్తులు వచ్చాయని ఈఎస్ పేర్కొన్నారు. కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకు 45, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు 19, బాన్సువాడ స్టేషన్ పరిధిలో 9 దుకాణాలకు 43, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 25, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 10 దుకాణాలకు 34 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దు

- ఎస్పీ రాజేశ్ చంద్ర



కామారెడ్డి క్రైం: రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయొద్దని ఎస్పీ రాజేశ్‌చంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట దిగుబడులను రోడ్లపై ఆరబోయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గతేడాది అక్టోబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 27 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వారిలో ఎక్కువగా ధాన్యం ఆరబెట్టడం కారణంగా జరిగిన ప్రమాదాల్లో మృతి చెందిన వారు ఉన్నారని పేర్కొన్నారు. వాహనాలు అదుపు తప్పడం, ఇతర వాహనాలను ఢీ కొనడం, ధాన్యం వెంబడి కాపలాగా ఉన్న రైతులను ఢీకొనడం లాంటి ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై ప్రజలు అవగాహన పెంచుకొని, విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. వడ్లు, మక్కలు, జొన్నలు, ఇతర పంట దిగుబడులను రోడ్లపై ఆరబెట్టవద్దని రైతులకు సూచించారు.

ఆర్టీసీ డీఎంగా రవికుమార్

బాన్సువాడ: బాన్సువాడ ఆర్టీసీ డీఎంగా రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు డీఎంగా విధులు నిర్వహించిన సరితాదేవి హైదరాబాద్‌లోని హకీంపేట్ బస్ డిపోకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో జీడిమెట్ల డీఎంగా విధులు నిర్వర్తిస్తున్న రవికుమార్ బదిలీపై బాన్సువాడ డీఎంగా వచ్చారు.

ఊపిరి తీసుకోలేక..


బాన్సువాడ మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

ఇబ్బంది పడుతున్న చిన్నారులు
- శ్వాసకోశ రుగ్మతలతో పలువురి అస్వస్థత
- కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు
- వాతావరణ మార్పులే కారణం!

బాన్సువాడ : వాతావరణంలో కొద్దిరోజులుగా వస్తున్న మార్పులతో పసిపిల్లల్లో న్యుమోనియా లక్షణాలు అధికంగా కనిపిస్తున్నాయి. చలి పెరుగుతుండడంతో చాలా మంది పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. బాన్సువాడ పట్టణంలోని మాతాశిశు సంరక్షణ ఆస్పత్రికి నిత్యం వచ్చే పిల్లల ఓపీ సంఖ్య 200 దాటుతోంది. ప్రతిరోజు 40-50 మంది పిల్లలు ఆస్పత్రిలో చికిత్స కోసం చేరుతున్నారు. వరుసగా వర్షాలు కురవడం ఆ తర్వాత తీవ్రమైన ఎండ, ప్రస్తుతం చలి వాతావరణంతో పిల్లలు అత్యధికంగా జ్వరం, దగ్గుతోపాటు ఆయాసానికి గురవుతున్నారు.

లక్షణాలు గుర్తించండి ఇలా..
న్యుమోనియా లక్షణాలున్న వారు శ్వాస తీసుకునేటప్పుడు ఊపిరితిత్తుల ప్రాంతంలో సొట్టలు కనిపిస్తా యని నిపుణులు చెబుతున్నారు. పిల్లలు శ్వాస తీసు కునేందుకు ఇబ్బంది పడతారు. సాధారణంగా రెండు నెలల్లోపు పిల్లలు నిమిషానికి 60 సార్లు, ఏడాదిలోపు పిల్లలు 50సార్లు, ఐదేళ్ల లోపు పిల్లలు 40సార్లు, ఐదేళ్ల కు మించిన పిల్లలు 30 సార్లు శ్వాస పీల్చుకున్నారంటే వారిలో న్యుమోనియా లక్షణాలున్నట్లు భావించాలి.


చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జాగ్రత్తలే రక్ష..
న్యుమోనియా తీవ్రత పెరుగుతున్నా కొద్ది పిల్లలు తీవ్ర ఇబ్బందికి గురవుతారు. చలి మొదలవుతున్న నేపథ్యంలో రోగాలు చిన్నారుల దరి చేరకుండా జాగ్రత్తలు పాటించాలి. పిల్లలకు చల్లని గాలి తగలకుండా వెచ్చగా ఉండే దుస్తులు వేయాలి. ద్విచక్ర వాహనంపై పిల్లలను తీసుకెళ్తే చల్లనిగాలికి జ్వరం, దగ్గు, ఆయాసం తదితర అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది.

విషజ్వరాలు వస్తున్నాయి



వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పిల్లల ఆరోగ్య పరిరక్షణకు తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. విషజ్వరాలు వస్తున్నాయి. ఎక్కువగా జ్వరం, దగ్గుతో పిల్లలు ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారింది. పిల్లల్లో ఏమాత్రం అనారోగ్య సమస్యలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స ఇప్పించాలి. – రతన్‌సింగ్, పిల్లల వైద్య నిపుణులు, బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రి

సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ప్రజాస్వామ్యబద్ధంగా డీసీసీ అధ్యక్షుల ఎన్నిక
- ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల

కామారెడ్డి టౌన్: అన్నివర్గాల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, అందుకోసం పార్టీని అట్టడుగు నుంచి పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాలుగు నియోజకవర్గాల ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 సంవత్సరాన్ని పార్టీ పునరుద్ధరణ సంవత్సరంగా ప్రకటించామన్నారు. యువకులు, విద్యావంతులు, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన వ్యక్తులకు, 55 ఏళ్లలోపు, పార్టీ కోసం కష్టపడుతున్న వారికి అవకాశం కల్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల ఎన్నిక కోసం ప్రజాస్వామ్యబద్ధంగానే దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక కోసం వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా పర్యటించి ప్రతి కార్యకర్త అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. దేశవ్యాప్తంగా అన్ని పార్టీలలో నాయకుల మధ్య విభేదాలు, వర్గాలు ఉండటం సహజమని, కాంగ్రెస్‌లో కూడా ఉంటాయని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. అందరినీ ఏకం చేసి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, తెలంగాణ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, పండ్ల రాజు, సందీప్, గోనే శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ జిల్లా అబ్జర్వర్ రాజ్‌పాల్ కరోల

ఎస్సారెస్పీలోకి మళ్లీ పోటెత్తిన వరద

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద ఆదివారం మధ్యాహ్నం నుంచి మళ్లీ పోటెత్తింది. ప్రాజెక్ట్‌లోకి గరిష్ఠంగా 60 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 16 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 50 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రానికి క్రమంగా ఇన్‌ఫ్లో 34 వేల 709 క్యూసెక్కులకు పడిపోయింది. దీంతో దిగువకు నీటి విడుదలను తగ్గించారు. 8 వరద గేట్ల ద్వారా 25 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రాత్రి సమయానికి ఇన్‌ఫ్లో మరింత తగ్గి 23 వేల క్యూసెక్కులకు పడిపోవడంతో నాలుగు గేట్ల ద్వారా 12,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, ఎస్కేప్‌గేట్ల ద్వారా 3 వేలు, సరస్వతి కాలువ ద్వారా 650, లక్ష్మి కాలువ ద్వారా 200, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌నిండుకుండలా ఉందని అధికారులు తెలిపారు.

ఇస్రో క్విజ్ పోటీల ఫలితాల విడుదల


వాల్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఆధ్వర్యంలో క్విజ్ పోటీ ఫలితాలను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో విద్యార్థులు ఆసక్తి కనబరచడం అభినందనీయమన్నారు. ఇస్రో క్విజ్ లాంటి కార్యక్రమాలు విద్యార్థుల విజ్ఞాన పరిధిని విస్తరింపజేసి భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగడానికి మార్గం చూపుతాయని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థినులను ఇస్రో సందర్శనకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళా శాలలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు 235 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కపాస్ కిసాన్ యాప్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ
పత్తికి ప్రభుత్వ మద్దతు ధర, కాటన్ కపాస్ కిసాన్ యాప్‌లకు సంబంధించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమ వారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడ ప్రతులను ప్రతి వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గ్రామ పంచాయతీలు, రైతు వేదికలు, మండల కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని దేవునిపల్లి ఎస్సై భువనేశ్వర్ సూచించారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని ఇస్రోజీవాడిలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మూఢనమ్మకాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నేరాల అదుపునకు ప్రధాన చౌరస్తాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాల్య వివాహాలు, మూఢ నమ్మకాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కళాబృందం ప్రదర్శనలు గ్రామస్తులను చైతన్యవంతం చేశాయి.

పంచముఖి ఆలయ అభివృద్ధికి తీర్మానాలు

కామారెడ్డి అర్బన్: శ్రీపంచముఖి హన్మాన్ ఆలయంలో కార్తీక మాసంలో విశేష పూజలు, నిర్వహించాలని ధర్మకర్తల మండలి తీర్మానించింది. ధర్మకర్తల మండలి సమావేశం అధ్యక్షులు వైద్య కిషన్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి తీర్మానించారు. దాతలు ఇచ్చే విరాళాల కోసం బ్యాంకు ఖాతాను ప్రారంభించాలని, భక్తులకు తాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈవో శ్రీధర్‌రావు, ధర్మకర్తలు బొట్టు శ్రీనివాస్, భీంరాజ్, గంగామణి, జి.శంకరయ్య పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి



బాన్సువాడ: గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని బీర్కూర్ ఎంపీడీవో మహబూబ్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు గ్రామాల్లో పర్యటిస్తూ మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గులు వేయాలని, బేస్‌మెంట్ లెవెల్ పూర్తయిన ఇళ్లను గృహ ప్రవేశాల కోసం సిద్ధం చేయాలని అన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగంగా జరిగేలా చూడాలని ఎంపీడీవో సయ్యద్ సాజీద్ అలీ అన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాలలో తిరుగుతూ ఇళ్లు ఏ స్థాయిలో ఉన్నాయో పూర్తి వివరాలను తెలుసుకొని తమకు సమాచారాన్ని అందించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.



పత్తిలో పొగాకు లద్దె పురుగు

- కాత దశలో తీవ్రనష్టం
- దిగుబడిపై వాన దెబ్బ



మర్కల్ శివారులో పత్తిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ప్రజాపతి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పత్తి పంటను పొగాకు లద్దె పురుగు ఆశిస్తుంది. రోజురోజుకూ లద్దె పురుగు ఉధృతి పెరుగుతోంది. ఇప్పటికే వర్షాలతో పత్తి పంటకు తెగుళ్లు సోకి తీవ్రంగా నష్టపోతుంటే, మరోవైపు లద్దె పురుగు ఆశించడంతో మూలిగే నక్కపై తాటికాయ పడిందన్న చందంగా మారింది. జిల్లాలో వరి తర్వాత రైతులు అధికంగా పండించేది పత్తి పంట.అన్ని మండలాల్లో రైతులు పత్తి సాగుకే ప్రాధాన్యమిస్తుంటారు. పత్తి పంట సాగుకు ఎకరానికి రూ.25 వేల వరకు ఖర్చు పెట్టారు. అయితే, గతేడాది వర్షాలు లేక పంటలు దెబ్బతినగా ఈ ఏడాది విస్తారంగా కురిసిన వర్షాలు పత్తి పంటను నాశనం చేస్తున్నాయి. భూముల్లో తేమ శాతం అధికమై మొక్కల్లో ఎదుగుదల లోపించింది. ఆశించిన స్థాయిలో పూత రాక, కాయలు సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. భారీ వర్షాల కారణంగా ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుందని రైతులు అంచనా వేస్తున్నారు.

రసాయణ నియంత్రణ చర్యలు:

విషపు ఎర: మూడోదశ దాటిన పొగాకు లద్దెపురుగు అదుపు చేయటానికి విషపు ఎరను వాడాలి. ఎకరానికి 10 కిలోల తవుడు, 2 కిలోల బెల్లంతో పాటు 300 గ్రాములు థయోడికార్బ్ మందును సరిపడా నీటితో కలిపి చిన్న చిన్న ఉండలుగా చేసుకొని సాయంత్రం వేళలో పొలమంతా చల్లుకోవాలి.

మందు పిచికారీ: పొగాకు లద్దె పురుగు నివారణకు నొవాల్యూరాన్ 1 ఎంఎల్ లేదా లుఫెన్యురాన్, 1.25 ఎంఎల్, లేదా థయోడికార్బ్ 1.5, క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

సహజ నియంత్రణ చర్యలు

వేప గింజల కషాయం 5 శాతం లేదా వేప నూనె 1500 పీపీఎం,5 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి పురుగు ఉధృతిని గమనించాలి. ఎకరానికి ఎర పంటగా 20 ఆముదం మొక్కలు నాటాలి.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



పొగాకు లద్దె పురుగు నివారించడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. తల్లి పొగాకు లద్దె పురుగు ఆకుల అడుగు భాగాన గుంపుగా గుడ్లను పెడుతుంది. గుడ్ల నుంచి వచ్చిన చిన్న లార్వాలు ఆకు అడుగున గుంపులు గుంపులుగా చేరి ఆకులోని పత్రహరితాన్ని గీసుకుని తినేస్తాయి. లార్వా దశలు పెరిగే కొద్ది విడివిడిగా ఆకులను కొరికి తిని ఈనెలను మాత్రమే మిగుల్చుతాయి. పగటి పూట ఇవి మొక్క మొదళ్ల భాగంలో భూమి లోపల ఉండి రాత్రి పూట నష్టం ఎక్కువ చేస్తాయి.

–ప్రజాపతి, ఏవో,సదాశివనగర్

తీవ్రంగా నష్టపోతున్నాం



పొగాకు లద్దె పురుగు పంటను తీవ్రంగా నష్ట పరుస్తోంది. అధికారులు పంటలను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇస్తే పంట నష్టం జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చు.

– వరకాంతం రాజు, రైతు, మర్కల్

పరిహారం చెల్లించాలి..



అకాలవర్షాల కారణంగా పత్తి పంటతోపాటు వరికి కూడా విపరీతమైన తెగుళ్లు సోకుతున్నాయి. సరైన దిగుబడులు రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలి.

– రిక్కల జైపాల్ రెడ్డి, రైతు, మర్కల్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

నిజామాబాద్‌నాగారం: వైద్య సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లోగల డీఎంహెచ్‌వో కార్యాలయంలో సోమవారం ఆమె వైద్యాధికారులు, నర్సింగ్ అధికారులకు, పీహెచ్‌సీ వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాజశ్రీ మాట్లాడుతూ.. ప్రతి ఆరోగ్య ఉపకేంద్రం పరిధిలో ఏఎన్ఎం, ఆశలు, అర్హులైన గర్భిణుల జాబితాను ఉంచుకోవాలన్నారు. రక్తహీనత గల గర్భిణులను ముందే గుర్తించి వారికి పోషకాహారం ఐరన్ మాత్రలు, ఐరన్ సూక్రోజ్ తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అత్యంత ప్రమాదకర లక్షణాలు గల గర్భిణులకు మాత్రమే శస్త్ర చికిత్సలు చేయాలని, మిగతా గర్భిణులకు సాధారణ ప్రసవాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తక్కువగా ప్రసవాలు చేసిన పీహెచ్‌సీ వైద్యాధికారులతో మాట్లాడి, ప్రసవాలు పెంచేలా కృషి చేయాలని ఆదేశించారు. ప్రసవానికి ముందే బర్త్ ప్లాన్ ప్రకారం గర్భిణులను ప్రభుత్వ ఆస్పత్రులకు తీసుకెళ్లాలని అన్నారు. తద్వారా మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ శ్వేత, అశ్విని, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్, ఏవో రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

నిజామాబాద్ నాగారం: ప్రతిఒక్కరికి సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీసెర్సిటేషన్)పై అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ అన్నారు. సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా నగరంలో సోమవారం ఆమె సీపీఆర్‌పై వివరించారు.ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకుంటూ ఉప్పును తగ్గించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, జీవనశైలి మార్పుల ద్వారానే జీవన శైలి వ్యాధులను అరికట్టవచ్చనన్నారు. వారంపాటు జిల్లావ్యాప్తంగా మూడు డివిజన్లలో సీపీఆర్‌పై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన అటవీశాఖ స్పోర్ట్స్ మీట్



బహుమతులు ప్రదానం చేస్తున్న జిల్లా జడ్జి శ్రీవాణి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని డిగ్రీ కళాశాల మైదానంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా జడ్జి శ్రీవాణి, అటవీశాఖ బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శర్వానన్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు చెందిన సుమారు 350 మంది అటవీశాఖ క్రీడాకారులు పాల్గొనగా 35 రకాల క్రీడలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ పురుషుల విభాగంలో నిర్మల్ జట్టు, మహిళల విభాగంలో ఆదిలాబాద్ జట్టు విజేతగా నిలిచాయి. వాలీబాల్‌లో ప్రథమ విజేతగా ఆదిలాబాద్, రన్నరప్‌గా నిర్మల్ జట్టు, క్రికెట్‌లో నిజామాబాద్ జట్టు, కబడ్డీ పురుషుల విభాగంలో నిజామాబాద్, మహిళల విభాగంలో నిర్మల్ జట్టు, త్రోబాల్ మహిళల విభాగంలో ఆదిలాబాద్ జట్టు, మార్చ్‌పాస్ట్‌లో నిర్మల్ జట్టు విజేతగా నిలిచాయి. ఓవరాల్ ఛాంపియన్స్ ట్రోఫీని నిర్మల్ జట్టు కైవసం చేసుకుంది. నిజామాబాద్ డీఎఫ్‌వో వికాస్ మీనా, నిర్మల్ డీఎఫ్‌వో నాగిని భాను, అధికారులు సుధాకర్‌రావు, శివకుమార్, నాలుగు జిల్లాల అటవీశాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్ట జాతరలో పాల్గొనాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



కమ్మర్‌పల్లి(భీమ్‌గల్): భీమ్‌గల్‌లోని లింబాద్రి గుట్ట(నింబాచలం) లక్ష్మీ నరసింహస్వామి జాతరలో పాల్గొనాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని సోమవారం ఆలయ అర్చకులు పార్థసారథి ఆహ్వానించారు. ఈమేరకు ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి, ఆహ్వాన పత్రికను అందజేసి, ఆశీర్వదించారు. వచ్చే నెల 5న జరిగే జాతరకు హాజరుకావాలని కోరారు.



అందాల రామచిలుకలు

కొమ్మకొమ్మకో సన్నాయి.. కోటి రాగాలు ఉన్నాయి.. అనే గేయానికి సరితూగుతోంది ఈ చిత్రం. బాన్సువాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న ఓ చెట్టుపై భారీ సంఖ్యలో రామచిలుకలు వాలిన దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది. చెట్టంతా రామచిలుకల గుంపు పరుచుకుపోయి చూపరులను కనువిందు చేశాయి. ప్రతి రోజు సాయంత్రం వేళలో ఈ చెట్టుపై రామ చిలుకలు భారీ సంఖ్యలో వాలుతుంటాయి. ఉదయం చూస్తే ఒక్క చిలుక కూడా కనిపించకుండా పోతాయి.

– బాన్సువాడ

బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే



దోమకొండలో ధర్నా చేస్తున్న బీసీ సంఘాల నేతలు

దోమకొండ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద బీసీ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జనాభాలో ఎక్కువ శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా అన్యాయం జరుగుతుందన్నారు. ప్రతి పార్టీ బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నాయకులు ఐరేని నర్సయ్య, తీగల తిర్మల్‌గౌడ్, అబ్రబోయిన స్వామి, రాజేందర్, మద్రి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణాల కుట్రల్ని తిప్పికొడతాం

కామారెడ్డి టౌన్: బీసీల 42 శాతం రిజర్వేషన్ల అమలును అడ్డుకుంటున్న అగ్రవర్ణాల కుట్రల్ని తిప్పికొడతామని బీసీ సంఘాల నాయకులు విమర్శించారు. సోమవారం జిల్లా కేంద్రంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. సమావేశంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్, నాయకులు రాజేందర్, స్వామి, మద్రి శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో..

రోడ్లకు మరమ్మతులు చేయరూ..!



కుర్లా సమీపంలో రోడ్డు పరిస్థితి

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లీ మండలాల్లోని పల్లెలకు వెళ్లే రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా రోడ్లపై గుంతలు పడి కంకర తేలడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డోంగ్లీ మండలంలోని కుర్లా వెళ్లే రహదారిపై పలు చోట్ల రోడ్డు తెగి ప్రమాదకరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో తెగిన రోడ్డును గమనించని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. లచ్చన్‌గేట్ నుంచి సుల్తాన్‌పేట్, లచ్చన్ గ్రామాలకు వెళ్లే బీటీ రోడ్డుకు అడుగుకో గుంతలు ఏర్పడి ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కంకర తేలిన సుల్తాన్‌పేట్ రోడ్డు

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం జాతీయ పోషణ మాసోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను అడిషనల్ కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 16 వరకు జరిగే పోషణ్ మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, జిల్లా సంక్షేమాధికారిణి రసూల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి



నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల చిన్నారి మృతి చెందింది. వివరాలు ఇలా.. అచ్చంపేట గ్రామానికి చెందిన మ్యాదరి శివగంగ, సత్యనారాయణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె మధురశ్రీ(3) ఆదివారం రాత్రి వేళ ఇంటి ఆవరణలో బహిర్భుమికి వెళ్లింది. కొద్దిసేపటికి ఇంట్లోకి పరుగెత్తుకు వస్తుండగా అదే సమయంలో ఇంటిపక్కనే ఉన్న శ్రీనివాస్ తన వాహనాన్ని తీస్తుండగా ప్రమాదవశాత్తు మధురశ్రీ కాళ్ల పైనుంచి వెళ్లగా తీవ్రంగా గాయపడింది. వెంటనే గమనించి కుటుంబీకులు ఆమెను ఎల్లారెడ్డిలోని ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స తర్వాత ఇంటికి తీసుకురాగా రాత్రివేళ మళ్లీ ఆమె అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తరలించగా మృతిచెందింది. ఈమేరకు స్థానిక ఎస్సై శివకుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇజ్రాయిల్‌లో వెంకటాపూర్‌వాసి..

వేల్పూర్: వేల్పూర్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన నీరటి బొర్రన్న(52) ఇజ్రాయిల్ దేశంలో గుండెపోటుతో మృతిచెందినట్లు సోమవారం తెలిసింది. బొర్రన్న సుమారు 16 ఏళ్లుగా ఉపాధి కోసం ఇజ్రాయిల్ దేశానికి వెళ్లివస్తున్నాడు. అక్కడ ఈనెల 11న ఉదయం స్నానం కోసం బాత్‌రూంకు వెళ్లగా, గుండెపోటుకు గురై మరణించినట్లు తెలిపారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ఇజ్రాయెల్‌లో ఉన్న వెంకటాపూర్ గ్రామస్తులు, బంధువులు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గేదె ..

రాజంపేట: మండలంలోని తలమడ్ల గ్రామంలో విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు ఇలా.. తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని క్రిష్ణారెడ్డి ఆదివారం రాత్రి తన పొలం వద్ద గేదెను కట్టి ఉంచి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లి చూడగా పంట పొలానికి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చనిపోయి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడం వల్ల గేదె కరెంట్ షాక్‌కు గురై మృతిచెందిటనట్లు పేర్కొన్నాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మృతురాలు నిర్మల్ జిల్లావాసి..

బాల్కొండ: మెండోరా శివారులో శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన విషయం తెలిసిందే. సోమవారం మృతదేహం వివరాలు తెలిసినట్లు ఎస్సై సుహాసిని తెలిపారు. మృతురాలిని నిర్మల్‌జిల్లా కుబీర్ మండలం శాంగ్వి గ్రామానికి చెందిన బొమ్మడి హంస(54)గా గుర్తించారు. వ్యవసాయ కూలీగా పనిచేసుకునే హంసకు కుటుంబంలో తరుచు గొడవలు జరిగేవి. దీంతో జీవితంపై విరక్తితో ఈ నెల 11న ఇంట్లో ఎవరికి చెప్పకుండ మెండోరా మండలం పోచంపాడ్ గ్రామ శివారులో కాకతీయ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించమన్నారు.

బోధన్‌లో ముగ్గురికి జైలు శిక్ష

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో ముగ్గురికి కోర్టు జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు. వివరాలు ఇలా.. పట్టణంలోని గోశాల వద్ద మట్కా నిర్వహిస్తున్న నెనావత్ మారుతిని పోలీసులు అదుపులోకి తీసుకొని సోమవారం కోర్టులో హాజరుపర్చారు. అలాగే పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన సల్మాన్, కొనాపూర్‌కు చెందిన మహ్మత్ ఫేరోజ్ మద్యం సేవించి వాహనం నడిపడంతో పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరు పర్చారు. సల్మాన్‌కు రెండు రోజుల జైలు శిక్ష, ఫిరోజ్‌కు ఒక రోజు జైలు శిక్షను జడ్జి విధించినట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో..

బోధన్: ఎడపల్లి మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో నిజామాబాద్ నగర కేంద్రానికి చెందిన షేక్ సలీం, సయ్యద్ మెహతార్, అలీన సుభాష్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిని సోమవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి ఒక రోజు రిమాండ్ విధించారని ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఇదే మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన షేక్ అమీర్ తన మొబైల్ ఫోన్ ద్వారా మట్కా ఆడిస్తూ పట్టుబడ్డాడని, అతనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి అర్జున్ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మెదక్‌కు చెందిన అర్జున్ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతుండగా, మధ్యాహ్నం కళాశాల హాస్టల్ నుంచి బయటకు వెళ్లి, తిరిగిరాలేదు. దీంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు ఎంత గాలించినా అతడి ఆచూకీ లభించలేదు. విద్యార్థి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దేవుడి ముందు పెట్టిన దీపం అంటుకొని ఇల్లు దగ్ధం



బాల్కొండ: దేవుడి ఫొటోల ముందు ఉన్న దీపంతో ఇంటికి నిప్పు అంటుకొని కాలిపోయిన ఘటన మెండోరా మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మెండోరాలోని రాజారపు భార్గవి సోమవారం ఇంట్లో దేవుడి ఫొటోల ముందర దీపం ముట్టించింది. అనంతరం ఇళ్లకు తాళం వేసి బయటకు వెళ్లింది. కొంత సమయం తర్వాత ఇంట్లో నుంచి పొగలు రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించి, ఇంటి తాళాలు పగలగొట్టారు. కానీ అప్పటికే ఇంట్లో సామగ్రి, నగదు కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ చారి ఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లినట్లు తెలిపారు. బాధితులకు తక్షణ సహాయం కింద రేషన్ బియ్యాన్ని అందించారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

గాంధారి(ఎల్లారెడ్డి): ఇటీవల గాంధారిలో జరిగిన రెండు దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా.. కొన్ని రోజుల క్రితం మండల కేంద్రంలోని చద్మల్ రోడ్డులో ఉన్న శివభక్త మార్కండేయ ఆలయ హుండీని గుర్తుతెలియని దుండగులు పగలగొట్టి దోచుకున్నారు. అదేరోజు పెద్దమ్మ కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసి ఉంచిన ఓ బైక్ చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ రెండు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన ఉప్పు సంతోష్‌కుమార్‌గా గుర్తించారు. సోమవారం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తున్నామని తెలిపారు. నిందితుడిని గుర్తించి, పట్టుకోవడంలో కృషి చేసిన కానిస్టేబుల్ సంజయ్, హోంగార్డ్ బంతిలాల్‌లను అభినందించారు.

బైక్ చోరీ కేసులో..

నిజామాబాద్ అర్బన్: బైక్ చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై సయిద్‌ముజాయిద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న ఆర్ఆర్ చౌరస్తాలోని వైన్స్ వద్ద మామిడి ప్రభాకర్ మద్యం తాగడానికి వెళ్లాడు. తన బైక్‌కు తాళాలు అలాగే ఉంచి వెళ్లడంతో తిరిగి వచ్చేసరికి చోరీకి గురైంది. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. న్యాల్‌కల్ రోడ్డుకు చెందిన ఎర్రం భూమయ్య, కంఠేశ్వర్ నవీన్ బైక్‌ను చోరీ చేసినట్లు గుర్తించి, వారి వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశామన్నారు.

ఎల్లారెడ్డి వైన్స్‌లో చోరీ

ఎల్లారెడ్డి: పట్టణంలోని త్రిశూల్ వైన్స్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. వైన్స్ దుకాణంపైన ఉన్న రేకులను గుర్తుతెలియన దుండగులు తొలగించి, లోపలికి చొరబడ్డారన్నారు. అనంతరం క్యాష్ కౌంటర్‌లోని రూ.15వేల నగదును దొంగిలించినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.